క్లుప్తంగా

నేడు కోవెలకుంట్లలో ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలోని నాల్గవ గ్రామ సచివాలయ పరిధిలో శుక్రవారం రెండవ విడత ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఈఓ గోపీనాథ్ తెలిపారు. వైద్య శిబిరంలో స్పెషలిస్ట్ డాక్టర్లు వివిధ జబ్బులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహిస్తారని, అవసరం మేరకు ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. సచివాలయ పరిధిలోని ప్రజలు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కొలిమిగుండ్ల: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా శుక్రవారం కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాలలో వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ సాయికృష్ణ తెలిపారు. డాక్టర్లు ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తారని చెప్పారు. గ్రామ ప్రజలు ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

కోవెలకుంట్ల: డెంగీ జ్వరంపై అప్రమత్తంగా ఉండాలని రేవనూరు పీహెచ్‌సీ డాక్టర్ విద్యాసాగర్ అన్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని గుండుపాపల గ్రామంలో ఓ మహిళకు డెంగీ లక్షణాలు బయట పడటంతో గురువారం ఆ ఇంటితోపాటు చుట్టుపక్కల దోమ లార్వాను అరికట్టేందుకు ఫైరిత్రం మందును పిచికారీ చేయించారు. కాలనీలోకి 50 కుటుంబాలకు సంబంధించి లార్వల్ సర్వే చేశారు. కార్యక్రమంలో మలేరియా అధికారి విశ్వనాథ్, ఎంఎల్‌హెచ్‌పీ శ్రావణి పాల్గొన్నారు.

జాతీయ ఉపకార వేతనానికి ఎంపిక

కోవెలకుంట్ల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎన్‌ఎంఎంఎస్ ఎంపికైనట్లు ఎంఈఓ వెంకట్రామిరెడ్డి తెలిపారు. 8వ తరగతి చదువుతున్న తిరుపాల్ గతేడాది నిర్వహించిన ఉపకార వేతనాల ప్రవేశ పరీక్షలో ప్రతిభ చాటి స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యాడన్నారు. ఈ విద్యార్థికి ఇంటర్మీడియేట్ పూర్తి అయ్యే వరకు ప్రతి ఏటా రూ. 12వేలు స్కాలర్‌షిప్ అందుతుందన్నారు. విద్యార్థిని ఎంఈఓతోపాటు హెచ్‌ఎం రాజయ్య, ఉపాధ్యాయులు నాగేశుడు, మల్లికార్జున, శ్రీనివాసులు, వెంకటేశ్వరరెడ్డి, సుధీర్, వెంకటరమేష్, తరుపతిరెడ్డి, శివశంకర్‌రెడ్డి తదితరులు అభినందించారు.

ఆల్బెండజోల్ మాత్రలు అందజేత

బనగానపల్లె రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంఈఓ స్వరూపకు ఎంపీడీఓ శివరామయ్య ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. ఈనెల తొమ్మిదిన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా పాఠశాలల్లో పిల్లలకు వేసేందుకు మాత్రలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నా రు.కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ సుబ్బరాయు డు,ఏఎన్‌ఎంలు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో బంగారం వ్యాపారస్తులు

డోన్ టౌన్ : పాతపేటకు చెందిన ఇద్దరు బంగారు వ్యాపారస్తులను పట్టణ పోలీసులు రెండు రోజుల క్రితం తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని బోరబండ వద్ద అదుపులోకి తీసుకోని డోన్‌కు తీసుకవచ్చినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. గతేడాది జూన్‌లో మెయిన్ బజార్‌లోని బంగారం అంగడి నిర్వాహకులు ఇద్దరు పలువురి నుంచి ఆభరణాలు తయారు చేయడానికి రూ. లక్షల్లో అడ్వాన్సు తీసుకోని ఉడాయించిన సంగతి తెలిసిందే. బాధితుల ఫిర్యాధు మేరకు కేసు నమోదు చేసుకున్న పట్టణ పోలీసులు నిందితులను అదుపులోకి తసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న బాధితులు గురువారం పట్టణ పోలీసు స్టేషన్ చేరుకుని పోలీసు అధికారులకు వివరాలు తెలియజేస్తుండటంతో సుమారు రూ. కోటి వరకు ఉన్నట్లు తెలిసింది. నిందితులను కోర్టులో హాజరు పరచినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

విద్యుత్ సబ్ స్టేషన్ సందర్శించిన విద్యార్థినులు

అవుకు: మండల కేంద్రం అవుకులో గురువారం విద్యార్థులకు ఇండస్ట్రియల్ విజిట్ కార్యక్రమంలో భాగంగా విద్యుత్ సబ్ స్టేషన్‌ను సందర్శించారు. ట్రాన్స్ కో ఏఈ పక్కీరయ్య విద్యార్థినిలకు సబ్ స్టేషన్ మొత్తం చూపించి, విద్యుత్ సరఫరా తీరను వివరించారు. ప్రత్యక్షంగా ఇండస్ట్రియల్స్‌ను విద్యార్థులు సందర్శిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ హెమియా తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మునీంద్ర, ఎలక్ట్రానిక్స్ ఉపాధ్యాయుడు నరేంద్ర, ఉపాధ్యాయులు ఉశేన్‌వలి, మున్నా పాల్గొన్నారు.

వృత్తి విద్యాకోర్సులతో స్వయం ఉపాధి

బేతంచెర్ల: బాలికలకు విద్యతోపాటు వృత్తి విద్యా కోర్సులో శిక్షణ తీసుకుంటే స్వయం ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆర్‌ఎస్ రంగాపురం జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎం మల్లికార్జున తెలిపారు. గురువారం మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం జెడ్పీ హైస్కూల్లో ప్రభుత్వం బాలికలకు ఒకేషనల్ కోర్సు ప్రారంభించింది. గురువారం పాఠశాల హెచ్ ఎం మల్లికార్జున, ఒకేషనల్ కోర్సు ఉపాధ్యాయురాలు ఉరుకుందమ్మ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణలో నైపుణ్యాలపై 9వ తరగతి విద్యార్థినులకు శిక్షణ ప్రారంభించారు.

మజరాలూ... మురిసే!

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మజరా గ్రామాలకు చేకూరిన మౌలిక వసతులు
- ఏళ్లతరబడి నెలకొన్న సమస్యలు పరిష్కారం
- సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామీణులు




నాగిశెట్టిపల్లె నుంచి బోయల తాడిపత్రి వరకు వేసిన తారురోడ్డు


చెంచుగూడెంకు ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు


నాగిశెట్టిపల్లెలో నిర్మాణ పనులు పూర్తయిన ఓవర్‌హెడ్ ట్యాంక్

కొలిమిగుండ్ల: ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పట్టణాలు, పంచాయతీలతోపాటు మజరా గ్రామాలు కళ కళలాడుతున్నాయి. ప్రత్యేకించి మజరాలకు సైతం మౌలిక వసతులు చేకూరడంతో ఆయా గ్రామాల ప్రజలు మురిసిపోతున్నారు. ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం మండలంలోని బిఉప్పలూరు గ్రామ పంచాయితీ పరిధిలో నాగిశెట్టిపల్లె, బోయల తాడిపత్రి (సమీపానున్న చెంచుగూడెం) మజారా గ్రామాలు. గతంలో ఈ గ్రామాలను పట్టించుకునే నాథుడు కరువయ్యారు. కనీస మౌలిక వసతులు కరువై తీవ్ర ఇబ్బందులు పడేవారు. రోడ్లు మరీ అధ్వానంగా ఉండేవి. బోయల తాడిపత్రి మజరాకే చెందిన చెంచుగూడెం ఒకటి ఉందని కూడా చాలా గ్రామాల ప్రజలకు తెలియదు. తాగునీటి కోసం గూడెం ప్రజలు పడరానిపాట్లు పడేవారు. సమీప పొలాల బోరుబావుల నుంచి తాగునీటిని తెచ్చుకుని కాలం గడిపారు చెంచులు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ప్రత్యేక చొరవతో ఈ మజరా గ్రామాలు అభివృద్ధి బాట పట్టాయి. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు మోక్షం లభించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాగిశెట్టిపల్లె ఎస్టీ కాలనీ కాలువతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. బ్రిడ్జి నిర్మించడంతో ఎస్టీలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రెండు మజారా గ్రామాల్లో రూ.2.92 కోట్లతో శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టారు. రూ.91 లక్షలతో నాగిశెట్టిపల్లె నుంచి బోయల తాడిపత్రి వరకు 3 కి.మీ మేర తారు రోడ్డు నిర్మించి గ్రామస్తులు ఏళ్లనాటి కల నెరవేర్చారు. ఊర్లు ఏర్పాటు నుంచి ఓవర్‌హెడ్ ట్యాంకులు ఉండేవి కావు. ప్రభుత్వం వచ్చాక జల్‌జీవన్ మిషన్ పథకం కింద ఓవర్‌హెడ్ ట్యాంక్‌లను త్వరితగతిన నిర్మించారు. త్వరలోనే ఇంటింటికీ కుళాయి కనెక్షన్‌లు ఇచ్చి శాశ్వత తాగునీటి సమస్యకు చెక్ పెట్టనున్నారు. బోయల తాడిపత్రి పరిధిలో ఉన్న చెంచుగూడెంలో 80 ఏళ్ల నుంచి చెంచులు నివాసం ఉంటున్నారు. రూ.42 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించి చెంచులకు రవాణ సదుపాయం కలిప్పించారు. చెంచుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేతోపాటు జెడ్పీ చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు

- రూ.91 లక్షలతో నాగిశెట్టిపల్లె నుంచి బోయల తాడిపత్రి వరకు తారురోడ్డు నిర్మాణం
- మంచినీటి సమస్య పరిష్కరించేందుకు రూ.30లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంక్
- బితాడిపత్రి నుంచి సమీపంలోని చెంచుగూడెంకు రూ.42 లక్షలతో సీసీ రోడ్డు
- నాగిశెట్టిపల్లెలో రూ.60 లక్షలతో జల్‌జీవన్ కింద ఓవర్‌హెడ్ ట్యాంక్,కుళాయి కనెక్షన్‌లు
- ఎస్టీ కాలనీ సమీపంలో రూ.30 లక్షలతో బ్రిడ్జి, సీసీ రోడ్డు
- రూ.15 లక్షలతో మెయిన్ రోడ్డు వద్ద క్లోజింగ్ డ్రైనేజీ


నాగిశెట్టిపల్లె ఎస్టీ కాలనీ సమీపంలో నిర్మించిన బ్రిడ్జి

- బీసీ కాలనీలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు ఏర్పాటు
- రూ.4లక్షలతో అంగన్‌వాడీ కేంద్రానికి మరమ్మతులు

రోడ్డు కష్టాలు తీర్చారు



గతంలో రోడ్డంతా గుంతలు పడి నడిచేందుకు ఇబ్బందులు పడాల్సి వచ్చేది. అడుగడుగున గుంతలు ఉండేది. అత్యవసర సమయంలో ఆటోలు కూడా వచ్చేవి కావు. వైఎస్సార్ ప్రభుత్వం వచ్చాక నాగిశెట్టిపల్లె నుంచి తారు రోడ్డు వేశారు. ఇప్పుడు చాలా సౌకర్యంగా ఉంది. రోడ్డు ఇరువైపులా రైతులు పొలాలు ఉన్నాయి. రోడ్డు వేయడం వల్ల రైతులకు మేలు జరిగింది. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డికి కృతజ్ఞతలు.

– గుర్రప్ప,బి.తాడిపత్రి

రోడ్డు వస్తుందని ఊహించలేదు



కొండలో ఎన్నో ఏళ్ల నుంచి నివాసం ఉంటున్నాం. కనీసం తాగేందుకు కూడ గూడేం వద్ద నీళ్లు ఉండేవి కావు. రైతుల పొలాల్లోకి వెళ్లి అతి కష్టం మీద తెచ్చుకునేవాళ్లం. ప్రభుత్వం వచ్చాక కరెంట్, నీళ్ల సౌకర్యం కల్పించారు. ముఖ్యంగా బితాడిపత్రి నుంచి మాగూడేం వరకు రోడ్డు నడిచేందుకు కూడా సరిగా ఉండేది కాదు. పెద్దపెద్ద బండరాళ్ల మీద రాక పోకలు సాగించేవాళ్లం. ఏదైనా ఆపద వస్తే చేతుల మీదు ఎత్తుకొని పోయేవాళ్లం . ఇప్పుడు సిమెంట్ రోడ్డు వేశారు. గూడేంకు రోడ్డు వస్తుందని కలలో కూడా అనుకోలేదు.

– పుల్లయ్య, చెంచుగూడేం

మౌలిక వసతులు కల్పిస్తున్నాం



పంచాయితీ పరిధిలోని మజరా గ్రామమైన బోయల తాడిపత్రిలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి చొరవతో మౌలిక వసతులు కల్పిస్తున్నాం. గతంలో ఎవరూ పట్టించుకోక పోవడంతో ప్రధాన సమస్యలు అలాగే ఉండిపోయాయి. ఎన్నో ఏళ్ల నుంచి లేని రహదారి సౌకర్యం కల్పించి ప్రజల కష్టాలు తొలగించాం. ప్రాధాన్యత మేరకు ప్రతి సమస్యను పరిష్కరిస్తున్నాం. మజరా గ్రామాలకు వసతులు కల్పించడం సంతోషంగా ఉంది.

– ఈశ్వరయ్య, సర్పంచ్

సెల్ ఫోన్ ట్రేడింగ్‌తో మోసం

డోన్ టౌన్: డబ్బు త్వరగా సంపాదించాలన్న ఆలోచన ఉన్న వారిని బురిడీ కొట్టించడానికి ఆధునిక సాంకేతికతను అడ్డం పెట్టుకోని పలువురు సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారు. యువత, వ్యాపారస్తులతో పాటు అమాయక ప్రజలు వీరి మోసాలకు బలవుతున్నారు. ఇదే కోవలో గురువారం సెల్ ఫోన్ ట్రేడింగ్ యాప్‌లో పెట్టుబడులు పెట్టి మోసపోయిన ఉదంతం పట్టణంలో వెలుగులోకి వచ్చింది. పెట్టిన పెట్టుబడికి మూడింతలు కేవలం పది రోజుల్లోనే తిరిగి వస్తుందని నమ్మబలికిన సెల్ ఫోన్ ట్రేడింగ్ యాప్ బారిన పడి డోన్ పట్టణానికి చెందిన పలువురు వ్యాపారస్తులు, యువత మోసపోయారు. ఎవ్వరికి ఫిర్యాదు చేయాలో తెలియక మిన్నకుండి పోయినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ యాప్‌లో కనీసం మూడు వేలు పెట్టుబడితో డౌన్‌లోడ్ చేసుకోని రిజిస్టర్ అవ్వాలి. అనంతరం యూజర్ నేమ్ పాస్‌వర్డ్‌తో లాగన్ అయ్యి నాలుగు అక్షరాల కోడ్‌తో పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. ఇలా వేలల్లో పెట్టుబడి ప్రారంభించి లక్షల్లో పెట్టారు. మొదటి పెట్టుబడికి పది రోజుల్లో వీరి ఖాతాల్లో మూడింతలు జమ అయ్యినట్లు ఈ యాప్ చూపిస్తుంది. దీన్ని నమ్మి మరలా లక్షల్లో పెట్టుబడి పెట్టుబడి పెడుతూ మోసపోయారు. వీరి యాప్ ఖాతాలో మొదట జమ అయిన మొత్తం కూడా ఉప సంహరించుకోవడానికి వీలుకావడం లేదని ఓ వ్యాపారస్తుడు తెలిపారు. ఈ విషయంపై పట్టణ పోలీసులను వివరణ కోరగా సైబర్ క్రైం పోలీసుకు సంబంధించిన విషయం అన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

డోన్ టౌన్ : పట్టణ పోలీసు స్టేషన్ ప్రక్కన ఉన్న అగ్నిమాపక కేంద్రం వద్ద గుర్తు తెలియని కారు ఢీకొనడంతో పులికొండ రంగస్వామి అనే వ్యక్తికి గాయాలయ్యాయని పట్టణ ఎస్‌ఐ శరత్‌కుమార్ రెడ్డి తెలిపారు. గత నెల జనవరి 26వ తేదీ రాత్రి పది గంటల సమయంలో క్షతగాత్రుడు మందుల కోసం మెడికల్ షాపునకు బైకుపై వెళ్తుంతుండగా ఈ సంఘటన చోటు చేసుకుందన్నారు. గాయపడిన రంగస్వామిని కర్నూలు వైద్యశాలకు తరలించి చికిత్సలు చేయిస్తున్నారు. బాధితుని మామ టీచర్స్ కాలనీకి చెందిన మేకల జయన్న ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

నాటుసారా స్వాధీనం

అవుకు: మండల పరిధిలోని రామాపురంలో గురువారం 40 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ బాల మద్దయ్య తెలిపారు. ఆ గ్రామానికి చెందిన సాత్రి బాల నాగమ్మ, లక్ష్మిభాయి సాయిబాబ ఆలయం సమీపంలో నాటు సారా అమ్ముతుండగా దాడులు నిర్వహించామన్నారు. సారాను స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసామని హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎంపీపీ


ఆర్ కొత్తపల్లె గ్రామంలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ, సర్పంచ్, నాయకులు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ కొత్తపల్లె గ్రామంలో గురువారం పలు అభివృద్ధి పనులను ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి ప్రారంభించారు. రూ.21.80 రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ రూ.17.50, బల్క్ మిల్క్ రూ.15.74 లక్షలు, రూ. 23 లక్షలతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్, రూ.30 లక్షలతో నిర్మించిన స్కూలు కంపౌడు వాల్‌ను సర్పంచ్ మహాలక్ష్మి, ఎంపీటీసీ మునేశ్వర్‌రెడ్డి, పంచాయతి రాజ్ ఇంజనీర్ గణేష్ ఆధ్వర్యంలో ఎంపీపీ ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన దేశానికే ఆదర్శం అన్నారు. పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకొని వచ్చి పేదలకు ఆర్థిక భరోసా కల్పించారన్నారు. కార్యక్రమంలో వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీ కృష్ణ , వైఎస్సార్‌సీపీ నాయకులు గూని నాగరాజు, శివరామిరెడ్డి, వెంగలరెడ్డి, నాగ మునిరెడ్డి, కరుణాకర్, బలరాముడు, రమణ, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయం


హుసేనాపురంలో మహిళలతో మాట్లాడుతున్న మంత్రి బుగ్గన తనయుడు అర్జున్ రెడ్డి

బేతంచెర్ల: పేదరిక నిర్మూలనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని మంత్రి బుగ్గన తనయుడు అర్జున్ రెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల శాఖ డైరక్టర్ బాబుల్ రెడ్డి, వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీకృష్ణ తెలిపారు. గురువారం మండల పరిధిలోని గూటుపల్లెలో రూ. 33 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ. 21 లక్షలతో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాన్ని ఏడీఏ అశోక్ వర్ధన్ రెడ్డి, ఏఓ కిరణ్ కుమార్, ఈఓ ఆర్డీ వెంకట రంగనాయక్, సర్పంచ్ శ్రీరాములు ఆధ్వర్యంలో వారు ప్రారంభించారు. అలాగే తవిసి కొండ గ్రామంలో రూ. 23 లక్షలతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్, మజార గ్రామమైన హుసేనాపురంలో రూ. 12 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం, రూ. 23లక్షలతో ఏర్పాటు చేసిన ఓవర్ హెడ్ ట్యాంక్‌ను సర్పంచ్ లక్ష్మిదేవి, గ్రామ నాయకులు బీ. వెంకటేశ్వర్ రెడ్డి, చింతల నాగిరెడ్డి, తిరుమలేశ్వర్‌రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, సంజీవుడు ఆధ్వర్యంలో ప్రారంభించారు. వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గ్రామస్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను నిర్మించారన్నారు. ఇంటింటికీ త్వరలో శుద్ధమైన నీరు అందజేస్తామన్నారు. సంక్షేమం, అభివృద్ధిని చూసి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అండగా నిలువాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రంగస్వామి, వైస్ ఎంపీపీ రంగస్వామి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్ రెడ్డి, నాయకులు శ్రీనాథ్‌రెడ్డి, వెంకటస్వామి, సుధాకర్,భరణి, గోరుమానుకొండ, రంగాపురం సర్పంచ్‌లు వెంకటేశ్వర్లు, రాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు


ఆసరా చెక్కును మహిళలకు అందజేస్తున్న దృశ్యం


సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పొదుపు మహిళలు

డోన్ : మహిళల అభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని,ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారిని అన్నిరంగాల్లో ప్రోత్సహిస్తున్నారని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు తెలిపారు. ఆసరా వారోత్సవాల సందర్భంగా పట్టణంలోని షాదిఖానాలో మెప్మా ముఖ్య అధికారి సుజాత అధ్యక్షతన గురువారం జరిగిన పొదుపు మహిళలు, ఆర్పీల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి చేపడుతున్న పథకాల గురించి వివరించారు. మహిళలకు అధిక ప్రాధాన్యతనిస్తూ అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతిదీవెన, ఆసరా, చేదోడు, పక్కాగృహాలు లాంటివెన్నో మంజూరు చేస్తున్న విషయాన్ని శ్రీరాములు గుర్తు చేశారు. గత ప్రభుత్వం మహిళలకు డ్వాక్రా రుణాల మాఫీ అంటూ మోసగించిన విషయాన్ని మహిళలు గుర్తుంచుకోవాలన్నారు. కేవలం డోన్ పట్టణంలోనే పొదుపు మహిళలు రూ. 2 కోట్లు టర్నోవర్ చేస్తున్న విషయాన్ని ఆయన వెల్లడించారు.

చెక్కు పంపిణీ

పట్టణంలో పొదుపు మహిళలకు నాల్గవ విడత వైఎస్సార్ ఆసరా పథకం కింద మంజూరైన రూ.4,54,32,820 చెక్కును అందజేశారు. రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, మున్సిపల్ వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్, కౌన్సిలర్లు దినేష్‌గౌడ్, మేకల విమల, బోయ కళావతి, మహేశ్వరరెడ్డి, ఆర్డీ రమణ, సుంకన్న, వెంకట్రాముడు, పాలుట్ల మీనాక్షి, టీఎంసి సుజాత, మెప్మా కోఆర్డినేటర్ ప్రమీల, భవానిబాయి మహిళ ఫెడరేషన్ అధ్యక్షురాలు రత్నబాయి తదితరులు చేతుల మీదుగా మహిళలకు చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా పొదుపు మహిళలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు.

హ్యాండ్ వాష్ ట్యాంక్ ప్రారంభం

పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత ప్రతిఒక్కరూ తెలుసుకునేవిధంగా యూనెసెఫ్ మంజూరు చేసిన హ్యాండ్ వాష్ ట్యాంకును మున్సిపల్ కార్యాలయం ఆవరణలో వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, టీఎంసీ సుజాత, మెప్మా ఇన్‌చార్జ్ ప్రమీల, కౌన్సిలర్ దినేష్‌గౌడ్ ప్రారంభించారు.

అధికారుల బదిలీ

డోన్ టౌన్ : త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా దీర్ఘ కాలికంగా పని చేస్తున్న పలువురు అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసింది. డోన్ ఆర్డీఓ వెంకటరెడ్డిని నగిరికి, తహసీల్దార్ విద్యా సాగర్‌ను కడప జిల్లాకు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డిని నూజివీడుకు బదిలీ చేస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసింది.

బైక్ చోరీ

డోన్ టౌన్ : పట్టణంలోని తారకరామనగర్ ఉలిగమ్మ గుడి వద్ద బుధవారం రాత్రి పల్సర్ బైకు చోరీకి గురైంది. గుడి సమీపంలో మేడ మీద నివాసం ఉన్న వెంకటరమణ ఇంటి ఎదుట బైకు పార్కు చేసాడు. గురువారం ఉదయం చూడగా బైకు కన్పించలేదు. దీంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

చదువుతోపాటు క్రీడలపై దృష్టి సారించాలి


పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత కాటసాని ఓబులరెడ్డి

బనగానపల్లె: విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు వైఎస్సార్‌సీపీ యువనాయకుడు కాటసాని ఓబులరెడ్డి సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో గురువారం ఎమ్మెల్యే కాటసాని పెద్ద కుమారుడు దివంగత కాటసాని నాగార్జునరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సీజన్-2 క్రికెట్ గ్రేస్‌బాల్ పోటీలను కాటసాని ఓబులరెడ్డి ప్రారంభించారు. ఆయన క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఓబులరెడ్డి మాట్లాడుతూ మా అన్న దివంగత కాటసాని నాగార్జునరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలతోపాటు క్రీడాకారుల కోసం క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ రాష్ట్ర డైరక్టర్ అబ్దుల్‌ఖైర్, వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి అత్తార్‌జాహీద్ హుశేన్, ముస్లిం మైనార్టీ నాయకుడు అబ్దుల్‌ఫైజ్, జిల్లా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి రవికుమార్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, కోనేటి దుర్గ, అత్తార్ అఖిల్‌హుశేన్, నీలి శివకృష్ణ, ఖమర్ అబ్బాస్, రహిమాన్, జైను, కాటసాని ఓబులరెడ్డి యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పండుగలా సాగిన పింఛన్ పంపిణీ


డోన్ : దివ్యాంగునికి పింఛన్ పంపిణీ చేస్తున్న కౌన్సిలర్లు సుంకయ్య, వెంకట్రాముడు


కొలిమిగుండ్ల : గొర్విమానుపల్లెలో రమాదేవికి పింఛన్ సొమ్ము అందిస్తున్న వలంటీర్ మహేంద్ర


సంజామల: రామిరెడ్డిపల్లెలో నారయనమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శ్రీనువాసులు

డోన్ : సామాజిక పింఛన్ పంపిణీ పండుగలా సాగుతోంది. గురువారం తెల్లవారుజాము నుంచే వలంటీర్ల, సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు లబిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశారు. నంద్యాల జిల్లాలో డోన్ అర్బన్ పంపిణీ కార్యక్రమంలో ప్రథమ స్థానంలో నిలవగా, బేతంచెర్ల అర్బన్ ద్వితీయ స్థానంలో నిలిచింది. డోన్ పట్టణంలో మొత్తం 5,578 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా 4753 మందికి వలంటీర్లు నగదు అందజేశారు.

బేతంచెర్ల: మండల కేంద్రమైన బేతంచెర్ల పట్టణంతో పాటు ఆయా గ్రామాల్లో వైఎస్సార్ పెన్షన్ కానుకను వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు తెల్లవారుజాము నుంచే ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు కౌన్సిలర్స్, వలంటీర్ల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. దీంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.

కోవెలకుంట్ల: మండలంలోని 12 గ్రామ సచివాలయాల పరిధిలో ఫిబ్రవరి నెల పింఛన్లు గురువారం ఠంచన్‌గా అందాయి. 17 గ్రామ సచివాలయాలకు సంబంధించి 6,116 మంది వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ, చేనేత, డప్పు, చర్మకళాకారుల పింఛన్లు ఉన్నాయి. ఆయా గ్రామ వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి నగదు అందించారు. మొదటి రోజే 5,680 మందికి అందజేసి 92శాతం పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీఓ సయ్యదున్నీసా తెలిపారు.

కొలిమిగుండ్ల: ప్రతి నెలా ఒకటో తేది భానుడి తొలి కిరణం ప్రసరించకముందే వైఎస్సార్ పెన్షన్ కానుక చేతికందుతోంది. గురువారం మండల వ్యాప్తంగా 16 గ్రామ సచివాలయాల పరిధిలో వలంటీర్లు పింఛన్ల పంపిణీ చేపట్టారు.

సంజామల: మండలంలో 11 సచివాలయాల పరిధిలోని ఫిబ్రవరి నెల పింఛన్ల పంపిణీ గురువారం తెల్లవారుజాము నుంచే ప్రారంభమైంది. 17 పంచాయతీలకు సంబంధించి 5,360 మంది లబ్ధిదారులు ఉండగా మొదటిరోజే 3516 మందికి నగదు అందజేసి 65.60 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీఓ నాగకుమార్ తెలిపారు.

హత్యాయత్నం కేసు నమోదు

అవుకు: స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జ్ ఎస్‌ఐ తిరుపాలు తెలిపారు. గుండ్లశింగవరం గ్రామానికి చెందిన భూపాల్ రెడ్డి పొలంలో అదే గ్రామానికి చెందిన కుమ్మరి మద్దిలేటి స్వామి సేద్యం చేయించుకున్నాడు. ఇందుకు మద్దిలేటి స్వామికి కూలీ రూ.6వేలు రావాల్సి ఉంది. గడ్డమేకులపల్లె రహదారిలో భూపాల్ రెడ్డిని తనకు డబ్బులు ఇవ్వాలని మద్దిలేటి స్వామి అడిగాడు. ఎక్కడపడితే అక్కడ అడుగుతావా అంటూ ఆగ్రహించిన భూపాల్ రెడ్డి కొడవలితో మద్దిలేటి స్వామిపై దాడి చేశారు. దీంతో అతని కడుపు భాగంలో తీవ్ర రక్తగాయమైంది. చికిత్స నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు నిందితునిపై కేసు నమోదు చేశామని ఇన్‌చార్జ్ ఎస్‌ఐ తెలిపారు.